రిపబ్లిక్ హిందుస్థాన్
తెలుగు దినపత్రిక
సంపుటి : 1 ఆదిలాబాద్ సంచిక : 300
శనివారం 16 డిసెంబర్ 2023
పేజీలు : 4
వెల : 5/-



విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న రిపబ్లిక్ హిందుస్థాన్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 89856 14333




# ప్రజా సంక్షేమం కోసమే ఆరు గ్యారెంటీలు

## పదేళ్ల నిర్బంధ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగింది

- కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తొందర్లోనే అమలు
- గత ప్రభుత్వ నిర్వాహకంతో విద్యుత్ సంస్థలు రూ.81,516 కోట్లు అప్పుల్లో
- 50 వేల 275 కోట్ల నష్టంలో విద్యుత్ సంస్థ కొనసాగుతుంది..
- పౌర సరఫరాల శాఖ 56 వేల కోట్లు అప్పుల్లో ..
- త్వరలో శాఖల వారీగా శ్వేత పత్రం విడుదల ..
- కొత్త ప్రభుత్వం ప్రయాణం ప్రజాసేవకు అంకితం..
- ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే దిశగా కృషి ..
- బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే రెండు గ్యారెంటీలు అమలు..
- అమరవీరుల కుటుంబాలకు 250 గజాల ఇంటి స్థలం, గౌరవభృతి..
- వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ కు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది..

హైదరాబాద్

ఉభయ సభలను ఉద్దేశించి తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం ప్రసంగించారు. అంతా ఊహించినట్లుగానే ఆరు గ్యారెంటీల అమలుతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వ? హయాంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకునే విషయంలో గవర్నర్ తన ప్రసంగంలో క్లారిటీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండింటిని ఇప్పటికే తమ ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసిందన్నారు. మిగిలిన వాటిని 100 రోజుల్లో అమలులోకి తీసుకువస్తామ్ని చెప్పారు. మహాలక్ష్మి స్కీమ్‌లో మిగిలిన హామీల అమలుకు కసరత్తు ప్రారంభించామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై తమ ప్రభుత్వం విచారణ జరిపిస్తుందని గవర్నర్ తెలిపారు. 'తొమ్మిదేళ్లలో తెలంగాణ ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేశారు. ఆర్థిక పరిస్థితిపై వాస్తవ పరిస్థితులను ప్రజల ముందు ఉంచుతాం. దివాళా తీసిన ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడమే మా ప్రభుత్వ లక్ష్యం. తెలంగాణలో మార్పును ప్రజలు గమనిస్తున్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా పాలన సాగాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజా దర్బార్‌లో ప్రజాసమస్యలు పరిష్కారం

## యశోద ఆస్పత్రి నుంచి కేసీఆర్ డిశ్చార్జ్

- డిశ్చార్జ్ అయి బంజారాహిల్స్‌లోని నందినగర్‌లోని ఆయన పూర్వ నివాసానికి వెళ్లిన కేసీఆర్
- అందుబాటులో ఉండనున్న సర్జరీకి సంబంధించి డాక్టర్లు
- తొమ్మిదిన్నర ఏళ్ళ తర్వాత నందినగర్‌లోని సొంత ఇంటిలో కేసీఆర్ బస





# మా గోడు వినండి..

## మమ్మల్ని బదిలీ చేయండి!

- ముఖ్యమంత్రిని కలిసిన పంచాయితీ కార్యదర్శులు..
- 317జీవోతో 300 కిలోమీటర్ల దూరానికి బదిలీ!
- స్థానికత కోల్పోయి నానా పాట్లు పడుతున్న కార్యదర్శులు
- గ్రామ స్థాయి పోస్టులకు జోన్‌లతో లింకులు!
- గత ప్రభుత్వ నిర్ణయంతో ఇబ్బందులు..
- సరిదిద్దాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌కు మొర పెట్టుకున్న కార్యదర్శులు

హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రజావాణిలో భాగంగా తెలంగాణ పంచాయతీ కార్యదర్శులు కలిసారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని, సర్వీసు కోల్పోవడంతో పాటు 300 కిలోమీటర్లకు పైగా దూరానికి బదిలీ చేయబడ్డామని తెలిపారు. కార్యదర్శులు ఇచ్చిన వినతిపత్రాన్ని తీసుకున్న ముఖ్యమంత్రి.. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం రెండేళ్ల కింద జీవో 317 తీసుకొచ్చింది. దీని వల్ల పల్లెల్లో విధులు నిర్వర్తిస్తోన్న గ్రామస్థాయి ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శులను ఏకాఏకీన దూరతీరాలకు బదిలీ చేశారు. ట్రాన్స్‌ఫర్‌లలో సుమారుగా 250 మంది పంచాయతీ కార్యదర్శులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఉద్యోగులు చెబుతున్నారు. కొత్త గ్రామపంచాయతీలు.. పంచాయతీరాజ్ చట్టం 2018



# పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి

- పొత్తులపై కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవు
- 'బీఆర్ఎస్, బీజేపీ పొత్తు ఉంటుందనేది ప్రచారం మాత్రమే
- లోకసభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుంది
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పై సమానంగా పోరాటం చేస్తాం
- లోక్‌సభలో అత్యధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం

హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ నేతలు, క్యాడర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవని స్పష్టం చేశారు. డిసెంబర్ చివరి వారంలో తెలంగాణకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రానున్నారని తెలిపారు. బీజేపీ కార్యాలయంలో శుక్రవారం కిషన్ రెడ్డి అధ్యక్షతన పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గ ప్రబారీలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. 'బీఆర్ఎస్, బీజేపీ పొత్తు ఉంటుందనేది ప్రచారం మాత్రమే. లోకసభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుంది. కాంగ్రెస్, -మిగతా3లో


# నా కోసం ట్రాఫిక్ ఆపొద్దు

- పోలీసులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- తన కోసం, తన కాన్వాయ్ కోసం ట్రాఫిక్‌ను ఆపొద్దు
- వాహనదారులకు ఇబ్బంది కలిగించొద్దని పోలీసులకు మౌఖిక ఆదేశాలు
- సాధారణ ట్రాఫిక్‌లోనే తన కాన్వాయ్‌నూ అనుమతించాలి
- ప్రజలతో పాటే తన



హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఓ కీలక నిర్ణ యం తీసుకున్నారు. తన కోసం, తన కాన్వాయ్ కోసం ట్రాఫిక్‌ను ఆపొద్దని, వాహనదారులకు ఇబ్బంది కలిగించొద్దని పోలీసులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. అలాగే సాధారణ ట్రాఫిక్‌లోనే తన కాన్వాయ్‌నూ అనుమతించాలని ఆదేశించారు. ప్రజలతో పాటే తన కాన్వాయ్ ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు -మిగతా3లో



## దక్షిణ కొరియాకు కొత్త భయం

- దేశ అంతర్గత సమస్య కావటం గమనార్హం
- సంతానోత్పత్తి తగ్గదల భవిష్యత్తులో దేశ జనాభా క్షీణించడంలో తీవ్ర ప్రభావం
- తాజా గణాంకాల ప్రకారం సగటు జననాల రేటు 0.72గా నమోదైంది
- ఈ తగ్గుదల ఇలాగే 2025 వరకు కొనసాగితే 0.65గా నమోదవుతుందని అధికారులు అంచనా

## పార్లమెంట్ భద్రత.. ప్రభుత్వ బాధ్యత కాదు'

- తాజాగా విపక్షాల ఆందోళనలపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే ఆసక్తికర వ్యాఖ్యలు
- భద్రత వైఫల్యంపై విపక్షాలు పార్లమెంట్‌లో నిరసనలు, ఆందోళనలు
- పార్లమెంట్ భద్రతా వైఫల్యాలు 1974, 1994లో కూడా చోటు చేసుకున్నట్లు వెల్లడి
- పార్లమెంట్ భద్రత వైఫల్యంపై ప్రధాని, కేంద్ర హోం మంత్రి



# విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి





**రిపబ్లిక్ హిందుస్థాన్, ఆదిలాబాదు :** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని, తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల ద్వారా మెరుగైన విద్య అందించాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకటి కరుణ అన్నారు. శుక్రవారం హైదరాబాదు నుండి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, ఎస్సీఈఆర్టి డైరెక్టర్ రాధా రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ, పిల్లల్లో విద్యాసామర్థ్యాలను పెంచడానికి రాష్ట్రవ్యాప్తంగా ఒకటి నుండి 5వ తరగతి వారికి తొలిమెట్టు, 6 నుండి 9వ తరగతి వారికి ఉన్నతి, పదవ తరగతి వారికి లక్ష్య అనే ప్రత్యేక కార్య క్రమాలను రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలో ప్రవేశపెట్టడం జరిగిందని తద్వారా పిల్లలు ప్రతి సబ్జెక్టులో ప్రతిభ కనబరచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసేందుకు ఈనెల 12 నుండి జనవరి 12, 2024 వరకు 'అకాడమిక్ బబుల్ ' అనే ప్రత్యేక కార్యక్రమంను రూపొందించామని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి అమలు చేయడం ద్వారా విద్యార్థుల్లో ధారాళంగా చదవడం, రాయడం, విషయాలవారి పూర్వ భావనల జ్ఞాన అభ్యసన ఫలితాలను సాధించవచ్చున్నారు. పాఠశాల విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా స్కూల్ వివరాలను తెలుసుకొని తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను డీఈవోలకు ఆమె సూచించారు,జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పి.ఎస్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు తొలిమెట్టు, లక్ష్య, ఉన్నతి కార్యక్రమాల ద్వారా పిల్లలకు అత్యు త్తమమైన విద్యాబోధనలు అందించడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా పక్కా ప్రణాళికతో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త, జిల్లా విద్యాశాఖ అధికారిని టి. ప్రణీత, అధికారులు, ఉన్నారు.

# అత్యంత కాస్ట్లీగా తెలంగాణ ఎన్నికలు
# నియోజకవర్గానికి 20 కోట్లపైనే ఖర్చు



**హైదరాబాద్ :** హోరాహోరీ జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఎలా సాధించిందనే దానిపై ఇప్పుడు అందరిలో ఆసక్తి నెలకొంది. కాంగ్రెస్ గెలుపు ఖాయం అనుకున్నరాష్ట్రాల్లో ఓటమి పాలై తెలంగాణలో విజయం సాధించడం వెనుక సీక్రెట్ ఏమిటనే చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో జరుగుతోంది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపును ప్రభావితం చేసిన అంశాలు ఏమిటనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చలు జరుగుతున్నాయి. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యానికి ఎన్ని కారణాలు ఉన్నా, కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలను మెరుగు పరిచిన అంశాలు ఏమిటని నేతల మధ్య చర్చ జరుగుతోంది.దేశంలో రాజకీయాలు అత్యంత ఖరీదుగా మారిపోయిన వేళ తెలంగాణలో ఆర్థికంగా బలమైన పునాదులు ఉన్న బిఆర్ఎస్ పార్టీని మట్టి కరిపించడం వెనుక పక్కా వ్యూహం ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. సాంప్రదాయ కాంగ్రెస్ రాజకీయాలకు భిన్నమైన వ్యూహాలను తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అమలు చేసినట్టు చెబుతున్నారు.సాధారణంగా కాంగ్రెస్ పార్టీలో ఓ వ్యక్తికి బాధ్యతలు అప్పగిస్తే అతనికి వ్యతిరేకంగా వరుస ఫిర్యాదులతో క్యూ కట్టే ధోరణి ఎక్కువగా కనిపిస్తుంది. రేవంత్ రెడ్డికి పిసిసి బాధ్యతలు అప్పగించడం గిట్టని వారు కాలికి బలపం కట్టుకుని ఎన్ని ఫిర్యాదులు చేసినా పార్టీ అధిష్టానం వాటిని ఏ మాత్రం పరిగణలోకి తీసుకోలేదని స్పష్టం చేస్తున్నారు.రేవంత్ రెడ్డికి అభ్యర్థుల ఎంపిక నుంచి ఎన్నికల నిర్వహణ వరకు ప్రతి విషయంలో కావాల్సినంత స్వేచ్ఛను గాంధీ కుటుంబం ఇచ్చిందని చెబుతున్నారు. దీంతో పాటు షర్మిలను ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోకపోవడం వంటి విషయంలో కూడా పంతం నెగ్గించుకున్నారు. తెలంగాణ అంతట బిఆర్ఎస్ పార్టీకి ఎదురుగాలి వీస్తోందనే విషయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోలిగారు. క్షేత్ర స్థాయిలో బిఆర్ఎస్ పార్టీ నేతలు మితిమీరిన విశ్వాసంతో ఉండటం, కాంగ్రెస్ పార్టీ వ్యూహాలను ఏ మాత్రం సీరియస్‌గా తీసుకోకపోవడం కలిసొచ్చిందని చెబుతున్నారు. దీంతో పాటు పోల్ మేనేజ్‌మెంట్ విషయంలో కూడా జాగ్రత్తగా వ్యవహరించినట్టు చెబుతున్నారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలవడం కూడా కీలకమైన విషయమని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల ప్రచారాలు, బిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓటర్లను ఆకట్టుకోవడంతో పాటు అభ్యర్థులకు ఆర్థికంగా అండగా నిలవడం కూడా కీలకంగా పనిచేశాయని చెబుతున్నారు.ఈ మొత్తం వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో పాటు పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, బలమైన ఆర్థిక వనరులు ఉన్న తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఒక్కతాటిపై పనిచేసినట్టు చెబుతున్నారు. అయా జిల్లాల్లో అభ్యర్థుల గెలుపు బాధ్యతల్లో కొంత భారాన్ని జిల్లాలో ముఖ్య నేతలు భరించినట్టు చెబుతున్నారు.అనధికారిక లెక్కల ప్రకారం 2009 ఎన్నికలతో పోలిస్తే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల వ్యయం గణనీయంగా పెరిగినట్టు చెబుతున్నారు. 2009లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ తరపున అప్పటి సిఎం కోటి రుపాయల వరకు ఆర్థిక సాయం చేసినట్టు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.తాజా ఎన్నికల్లో ఈ వ్యయం భారీగా పెరిగిందని పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థికి వారి ఆర్థిక అవసరాలను తీర్చడంలో కాంగ్రెస్ పార్టీతో పాటు స్థానిక నాయకత్వం కూడా అండగా నిలిచిందని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో అత్యతం ఖరీదైన ఎన్నికలు తెలంగాణలోనే జరిగి ఉంటాయని ఓ నాయకుడు తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న ఓ నాయకుడి అంచనా ప్రకారం సగటున ఒక్కో అభ్యర్థికి పదికోట్ల కంటే ఎక్కువ ఖర్చై ఉంటుందని తెలిపారు.కొన్ని చోట్ల అంతకు మించి కూడా ఖర్చై ఉండొచ్చని అంచనా వేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కాస్త ఖర్చు తగ్గినా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వ్యయం కళ్లు చెదిరే లెక్కల్లో ఉంటుందని వివరించారు.

## అంగన్వాడి కార్యకర్తలు అరెస్టు

**హిందూపురం :** పలు సమస్యల పరిష్కారానికై అంగన్వాడీలు చేపడుతున్న నిరసన కార్యక్రమాలు జోరందుకున్నాయి. అంగన్వాడి కేంద్రాలకు తాళాలు పగలగొట్టి ఎంపీడీవోలు రెవెన్యూ సిబ్బంది వేరే తాళాలు వేయడం సమంజసం కాదని అంగన్వాడీలు హిందూపురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు దిగారు.శ్రీసత్య సాయి జిల్లా హిందూపురంలో అంగన్వాడీ కార్యకర్తలు పలు సమస్యలపై నిరసనలు తెలుపుతున్నారు. అంగనవాడి సిబ్బందిని బలవంతంగా పోలీస్ స్టేషన్ కు తరలించి అరెస్టు చేయడంతో పాటు అంగన్వాడీ కేంద్రాలకు ఉన్న తాళాలను పగలగొట్టి ఎంపీడీవో, కమిషనర్లు వేరే తాళాలు వేశారు. దీంతో ఆగ్రహించిన అంగన్వాడి వర్కర్లు హిందూపురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్వాడి కార్యకర్తలు నినాదాలు చేశారు.

## తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్న చలి



**హైదరాబాద్ :** రెండు తెలుగు రాష్ట్రాల్లో చలి విపరీతంగా పెరిగిపోయింది. పగటి పూట ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. సాదారణం కన్నా తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో 12 నుంచి 13డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయింది. ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, అరకు సహా పలుజిల్లాలను చలి వణికిస్తోంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

## మీసేవ ఆధార్ సెంటర్ తనిఖీ

**ఆధార్ కార్డు అప్డేట్ మరింత సులభం... మొబైల్ తో...**



**రిపబ్లిక్ హిందుస్థాన్, ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ అర్బన్ లో గల మావల తహసీల్దార్ ఆఫీస్ లోని ఆధార్ సెంటర్ ను కలెక్టరేట్ ఈ.డి.యమ రవి గురువారం సందర్శించారు. ఆధార్ సర్వీసెస్ ను ఆధార్ సెంటర్స్ లో కాకుండా ప్రత్యామ్నాయంగా మొబైల్ డెస్క్టాప్ ద్వారా కూడా మొబైల్ నెంబర్,అడ్రస్ మరియు రాష్ట్రం పేరు వంటి డీటెయిల్స్ అప్డేట్ చేసు కోవచ్చు అని తెలిపారు. మొబైల్ లాగిన్ ద్వారా కూడా సంబంధిత సేవలను పొందడానికి గూగుల్ ప్లే స్టోర్ లేదా అప్ స్టోర్ నుండి యమ-ఆధార్ ఆప్ వెర్షన్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని కూడా ఆధార్ అప్డేట్ చేయవచ్చు అని అన్నారు .ఉయుడై ఢిల్లీ సెంట్రల్ ఆఫీస్ నూతనంగా తెలిపిన వివరాల ప్రకారం ఎక్కడైతే అధిక రుసుము వసులు చేసరో వారిపై తగిన చర్యలు తీసుకొని ,అలాగే 50,000 జరిమానా విధించ బడును అని పేర్కొన్నారు. సిటిజన్స్ 1947 కి గాని మీసేవ సెక్షన్ కలెక్టరేట్ యందు కంప్లైంట్ ఇవ్వగలరని అని తెలిపారు ..జిల్లా లో కొన్ని మండలంలో సస్పెండ్ గురైయానా ఆధార్ సెంటర్ స్టేటస్ రాష్ట్ర ఈ.ఎస్.డి కమీషనర్ ఆఫీస్ లో పరిశీలనలో ఉంది అని తెలియజేశారు.

## ఐపీఎస్ ఉద్యోగం నుంచి ఎమ్మెల్యేగా...



**వరంగల్ :** నాడు ఐపీఎస్ అధికారి. నేడు ఎమ్మెల్యే. ఖాకీ ఉద్యోగం నుండి పదవీ విరమణ పొందగానే అనూహ్యంగా ఆయన ఎమ్మెల్యే అయిపోయాడు.. ఆ జిల్లాలో కీలక నేతగా మారిన ఆయన, ఇప్పుడు అసెంబ్లీలో అడుగు పెట్టాడు. ఇంతకీ ఎవరు ఆ పోలీస్ ప్రజాప్రతినిధి..!పోలీసు ఉద్యోగానికి స్వస్తి పలికి చట్టసభల్లో అడుగు పెట్టాలని తహతహలాడిన వారు ఎంతోమంది ఉన్నారు. పదవీ విరమణ పొందిన వారు కూడా ప్రజాప్రతినిధి కావాలనే తాపత్రయంతో పరుగులు పెట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.. కానీ అలాంటి పోలీస్ అధికారులు నేరుగా ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీచేసి గెలిచినవారు చాలా అరదు. అందులోనూ ఒక రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎమ్మెల్యేగా గెలుపొందడం అంటే చరిత్రే..!వరంగల్ జిల్లా వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.అర్ నాగరాజు ఇప్పుడు జనంలో చర్చగా మారాడు. ఐపీఎస్ ఉద్యోగం నుండి పదవీ విరమణ పొందిన వెంటనే ప్రజల చేత ఎన్నుకోబడి ఎమ్మెల్యే అయ్యాడు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా పదవీ విరమణ పొందిన వెంటనే ఖాకీ డ్రెస్ వదిలి, ఖద్దర్ చొక్కా వేశాడు. ఇంకేముంది ఆయనకు వర్ధన్నపేట నుండి కాంగ్రెస్ టికెట్ లభించింది. వర్ధన్నపేట సిట్టింగ్ ఎమ్మెల్యే అరూరి రమేష్‌పై బంపర్ మెజార్టీతో గెలిచిన కేఆర్ నాగరాజు ఇప్పుడు అసెంబ్లీలో అడుగు పెట్టాడు..హనుమకొండ కు చెందిన కే అర్ నాగరాజు 1989లో సబ్ ఇన్స్పెక్టర్‌గా పోలీస్ ఉద్యోగంలో చేరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో, ముఖ్యంగా అత్యధికంగా నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ, నిజామాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు నిర్వహించారు. ఈ క్రమంలోనే 2023 మార్చి నెలలో పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత ఖాకీ డ్రెస్ తీసేసి ఖద్దర్ చొక్కా వేసుకున్న నాగరాజు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వర్ధన్నపేట నాఅ రిజర్వుడ్ నియోజక వర్గం నుండి బరిలోకి దింపింది.ఈ నియోకవర్గానికి చెందిన బలమైన నేత, సిట్టింగ్ ఎమ్మెల్యే అరూరి రమేష్ పై 20,020 ఓట్ల మెజారిటీతో గెలుపొంది రికార్డ్ సృష్టించాడు. మొన్నటి వరకు ఖాకీ పోలీస్ యూనిఫామ్తో క్రమశిక్షణ కలిగిన పోలీస్ అధికారిగా విధులు నిర్వర్తించిన నాగరాజు, ఇప్పుడు ప్రజాప్రతినిధిగా తన మార్క్ చూపుతున్నారు. పోలీస్ అధికారిగా సక్సెస్ సాధించిన ఆయన, పొలిటికల్ లీడర్ గా ఎమ్మెల్యేగా ఎలాంటి మార్క్ చూపిస్తారో చూడాలి..!

## సీతక్క ఊరికి బస్సు



**వరంగల్ :** గిరిజన ప్రాంతాల్లో వసతుల విషయంలో ప్రభుత్వాలు చెబుతున్న గణాంకాలకు.. వాస్తవ పరిస్థితికి అస్సలు పొంతన ఉండదు. ఇప్పటికీ రవాణా కష్టాల్లో బతుకు బండి లాగిస్తున్న గ్రామాలు ఎన్నో ఉన్నాయి. సరైన రోడ్డు ఉండదు. మౌలిక వసతులు సైతం గిరిజనులు ఎరుగరు. ప్రభుత్వాలు మాత్రం అంత సవ్యంగా ఉన్నట్లు చెబుతుంటారు. అయితే ప్రజా ప్రతినిధులు దృష్టిసారించే గ్రామాలు మాత్రం అభివృద్ధి చెందుతున్నాయి. ఈ కోవలోకి వస్తుంది జగ్గన్నపేట గ్రామం. మొన్నటి వరకు ఆ ఊరు ఎక్కడ ఉందో తెలియనట్టుగా అధికారులు ఉండగా.. ఇప్పుడు ఉరుకులు పరుగులు పెట్టి ఆ గ్రామం పై ప్రత్యేక ఫోకస్ పెడుతున్నారు. మంత్రి సీతక్క సొంత గ్రామం కావడమే అందుకు కారణం.ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు నియోజకవర్గం నుంచి ముచ్చటగా మూడోసారి సీతక్క గెలుపొందిన సంగతి తెలిసిందే. రేవంత్ క్యాబినెట్లో ఆమె మంత్రి అయ్యారు కూడా. అటు కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణాన్ని కల్పించిన సంగతి తెలిసిందే.అయితే మంత్రి సీతక్క స్వగ్రామానికి రోడ్డు మార్గం ఉన్నా ఆర్టీసీ బస్సులు నడపడం లేదు. దీనిపై మీడియాలో కథనాలు రావడంతో ఆర్టీసీ అధికారులు స్పందించారు. రూట్ సర్వే చేశారు. బస్సు నడిపేందుకు నిర్ణయించారు. దీనిపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.సీతక్క విపక్షంలో ఉన్నప్పుడు ఏనాడు ఆర్టీసీ అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. చాలాసార్లు బస్సు సౌకర్యం కల్పించాలని ఆమె అడిగిన అప్పటి ప్రభుత్వం పెద్దగా స్పందించలేదు. ఇప్పుడు సీతక్క మంత్రి కావడంతో స్పందించాల్సిన అనివార్య పరిస్థితి ఎదురైంది. దీంతో జగ్గన్నపేట గ్రామస్తులు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు తమకు ఉచిత బస్సు సౌకర్యం కలుగుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రవేశపెట్టిన మహిళల ఉచిత బస్సు సౌకర్యానికి విశేష స్పందన లభిస్తోంది. మారుమూల గ్రామీణ ప్రాంతాల వారు సైతం తమ రూట్లో బస్సులు వేయాలని విజ్ఞప్తులు చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఆచితూచి నిర్ణయం తీసుకుంటోంది.

# వైద్యశాస్త్రంలోనే వింత ఘటన.. చనిపోయిన తర్వాత ఎలా సాధ్యం?

వైద్య శాస్త్రంలో ఇదో అద్భుతమని చెప్పాలి. గుండెపోటుతో ఓ మహిళ చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. అయితే ఆశ్చర్యంగా ఆమె 24 నిమిషాల తర్వాత లేచి కూర్చుంది. ఈ వింత ఘటన అమెరికాలో చోటు చేసుకుంది. ఈ పరిణామంతో డాక్టర్లు సైతం షాక్‌కి గురయ్యారు. తాను స్పృహలో లేని ఆ 24 నిమిషాల్లో తనకు ఎలాంటి అనుభూతి ఎదురయ్యిందో తాజాగా ఆమె సోషల్ మీడియాలో పంచుకుంది. సాధారణంగా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడో, అనుకోని పరిస్థితుల్లో చచ్చి బతికాం అనే సామెతను వాడుతుంటారు. అంటే చావు అంచుల దాకా వెళ్లి ప్రాణాలతో బయటపడ్డప్పుడు ఇలా అంటుంటారు. కానీ అమెరికాకు చెందిన లారెన్ కెనడే అనే మహిళ మాత్రం చచ్చి బతికింది. తనకు ఎదురైన ఈ విచిత్ర అనుభవం గురించి లారెన్ నెటిజన్లతో ఈ విధంగా పంచుకుంది. "గత ఫిబ్రవరిలో నాకు గుండెపోటు వచ్చింది. ఆంబులెన్స్‌కి కాల్ చేసి ఆలోగా నాకు




సీపీఆర్ చేశాడు. కానీ ఎలాంటి చలనం లేదు. హాస్పిటల్‌కి వెళ్లగానే నన్ను పరిశీలించిన అనంతరం నేను చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. కానీ సరిగ్గా 24 నిమిషాల అనంతరం నా గుండె మళ్లీ కొట్టుకోవడం ప్రారంభించింది. అయితే వెంటనే కోమాలోకి వెళ్లిపోయాను.
రెండు రోజులకు గానీ స్పృహలోకి రాలేదు. మెదడుకు షాక్ ట్రీట్మెంట్ ఇచ్చాక సాధారణ స్థితికి వచ్చాను. దాదాపు 9 రోజుల పాటు ఐసీయూలో వైద్య బృందం నన్ను పరీక్షించింది. మరణం అంచుల వరకు వెళ్లొచ్చాను. ఇప్పుడు నాకు చావు అంటే ఏమాత్రం భయం లేదు.హార్ట్ ఎటాక్‌కి గురైనప్పుడు సరైన సమయంలో నా భర్త సీపీఆర్ చేయడం వల్ల నా ప్రాణాలు దక్కాయి. తను ఎప్పటికీ నా హీరో" అంటూ ఆమెపేర్కొంది. లారెన్‌కు ఎదురైన ఈ పరిస్థితిని వైద్య శాస్త్రంలో లాజరస్ ఎఫెక్ట్ అని అంటారు.అంటే చనిపోయిన సందర్భంలో చాలా అరుదుగా ఇలా మళ్లీ జీవం పోసుకోవడం జరుగుతుంది. అయితే ఇలాంటి కేసుల్లో మళ్లీ బతికిన వారు ఎక్కువ కాలం జీవించలేరని, అయితే లారెన్ కేసు ఆశ్చర్యంగా ఉందని న్యూయార్క్ పోస్ట్ పేర్కొంది. గతంలో 1982 నుంచి 2018 మధ్య ఇలాంటి కేసులు 65 నమోదయ్యాయని,అందులో 18 మంది మాత్రమే పూర్తిగా కోలుకున్నారని స్పష్టం చేసింది.

# పార్లమెంట్ దాడి... మాస్టర్ మైండ్ లలిత్

**న్యూఢిల్లీ :** లోక్‌సభ దాడికి ప్లాన్ చేసిన మాస్టర్‌మైండ్ లలిత్ ఝాని అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. లలిత్ ఝాతో పాటు మరో ఇద్దరు నిందితులనూ అరెస్ట్ చేసి ప్రశ్నిస్తున్నారు. అయితే...ఈ మొత్తం ఘటనకు సూత్రధారి లలిత్ ఝా అరెస్ట్‌తో పూర్తి వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. నిజానికి ఈ దాడి జరిగినప్పటి నుంచి లలిత్ ఝా పరారీలో ఉన్నాడు. ఇప్పుడిప్పుడే ఈ నిందితుడి బ్యాగ్రౌండ్ గురించి కీలక విషయాలు వెల్లడవుతున్నాయి. బిహార్‌కి చెందిన ఝా...కోల్‌కత్తాలో టీచర్‌గా పని చేస్తున్నాడు. పార్లమెంట్‌కి సమీపంలోని కర్తవ్యపథ్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్ అంటే లలిత్‌కి ఎంతో ఇష్టం. ఆయన ఐడియాలజీపై ఆసక్తి పెంచుకున్నాడు. లలిత్ ఝా ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడే వాడు కాదని, మౌనంగా ఉండేవాడని సన్నిహితులు చెబుతున్నారు. స్థానిక విద్యార్థులకు టీచింగ్ చేసేవాడు. కొన్నేళ్ల క్రితం కోల్‌కత్తాలోని బుర్రాబజార్‌కి ఒక్కడే వచ్చాడు. చాలా రోజుల పాటు అక్కడే ఒంటరిగా ఉన్నాడు. కానీ ఎవరికీ పెద్దగా కనిపించే వాడు కాదు. లో ప్రొఫైల్ మెయింటేన్ చేసేవాడు. రెండేళ్ల క్రితం ఉన్నట్టుండి అక్కడి నుంచి ఖాళీ చేశాడు. అక్కడే ఎన్నో ఏళ్లుగా ఉంటున్న ఓ టీ షాప్ ఓనర్ ఇదంతా చెప్పాడు. ఈ దాడికి సంబంధించి మరో కీలక విషయమూ వెలుగులోకి వచ్చింది. లోక్‌సభలో టియర్ గ్యాస్ ప్రయోగించాలని ప్లాన్ చేసుకున్న నిందితులు ఒకవేళ ఈ ప్లాన్ ఏ ఫెయిల్ అయితే ప్లాన్ బీ అమలు చేయాలని ముందుగానే స్కెచ్ వేసుకున్నారు. పోలీసుల విచారణలో ఈ విషయం చెప్పాడు ప్రధాన నిందితుడు లలిత్ ఝా. నీలమ్, అమోల్ ఒకవేళ ఏ కారణం వల్లనైనా పార్లమెంట్ వరకూ వెళ్లలేకపోతే...మహేశ్, కైలాశ్ వెళ్లాలని ప్లాన్ చేసుకున్నారు. వేరే రూట్ నుంచి లోపలికి వెళ్లి



పార్లమెంట్ ఆవరణలో కలర్ బాంబ్‌లు కాల్చాలని అనుకున్నారు. మీడియా కెమెరాల ముందు నినాదాలు చేయాలని భావించారు. కానీ...వాళ్లు అనుకున్నట్టుగ్గా ప్లాన్ ఏ వర్కౌట్ అయింది. యథావిధిగా సాగర్ శర్మ, మనోరంజన్ సభలోకి దూసుకెళ్లి కలర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటన తరవాత తాను ఎక్కడ ఉండాలో కూడా ముందుగానే ప్లాన్ చేసుకున్నాడు లలిత్ ఝా. మహేశ్ ఇంట్లో తలదాచుకున్నాడు. తన ఐడీ కార్డ్ ఉపయోగించి ఓ గెస్ట్‌హౌజ్‌లో షెల్టర్ ఇచ్చాడు.

పార్లమెంట్ బయట నీలమ్, ఆమోల్ షిండేలు పొగ స్ప్రే చేశారు. లలిత్ ఝా వీడియో రికార్డు చేశాడు. అక్కడి నుంచి రాజస్థాన్ పారిపోవడానికి ముందే...సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేశాడు. మీడియాలో కవరయ్యేలా చూడాలని ఓ ఎన్జీవోకు వీడియో క్లిప్ పంపాడు. దాడికి ముందే నలుగురి ఫోన్లను లలిత్ తీసుకున్నాడు. నిరుద్యోగం, మణిపూర్‌లో హింసకు వ్యతిరేకంగానే దాడి చేసినట్లు నిందితులు చెప్పినట్లు తెలుస్తోంది.

# గూగుల్ మ్యాప్స్ మీ పెట్రోలును ఆదా చేస్తుందా?

### గూగుల్ మ్యాప్స్ కొత్త ఫీచర్

గూగుల్ మ్యాప్స్ ఉంటే ఎక్కడికైనా వెళ్లిరావొచ్చనే ధీమా ఉంటుంది. కొన్నిసార్లు కచ్చితమైన లోకేషన్లు చూపించకపోయినా.. మనం ఎంచుకున్న లోకేషన్ దగ్గరి వరకు వెళ్లేలా సహాయపడుతుంది. ఈ గూగుల్ మ్యాప్స్‌ను సుదూర ప్రాంతాలు, కొత్త ప్రాంతాలకు వెళుతున్నప్పుడు వెళ్లే రూట్‌తోపాటు వేగం తెలుసుకోవడానికి ఉపయోగిస్తూంటాం.
అయితే గూగుల్ మ్యాప్స్ ఇకమీదట ఫ్యూయల్ పొదుపు చేయడంలోనూ సహాయపడనుంది. ప్రయాణంలో ఫ్యూయల్ పొదుపు చేయడానికి గూగుల్ మ్యాప్స్ కొత్త ఫీచర్ తీసుకొచ్చింది. 'ఫ్యూయల్ ఎఫిషియంట్ రూట్స్' అనే పేరుతో గూగుల్ యూజర్లకు ఈ ఫీచర్‌ను పరిచయం చేసింది. ఇప్పటికే అమెరికా, ఐరోపా యూనియన్ దేశాలు, కెనడాల్లో వినియోగంలో ఉన్న ఈ ఫీచర్ ఇక భారత్‌లో అందుబాటులోకి తెచ్చింది. ఈ గూగుల్ మ్యాప్స్ ఫ్యూయల్ సేవింగ్స్ ఫీచర్ ఎనేబుల్ చేస్తే.. మనం వెళ్లే రూట్‌లో లైవ్ ట్రాఫిక్ అప్ డేట్స్, రహదారులు, ఇంధన సామర్థ్యాన్ని అంచనా వేస్తుంది. వాహన వేగం, ఫ్యూయల్ వాడకం రెండింటిని పరిగణనలోకి తీసుకుని అందుకు అనుకూల రూట్ చూపుతుంది. అలాగే ఆ రూట్‌లో వెళ్లడం వల్ల ఎంత ఫ్యూయల్ ఆదా అవుతుందో తెలుపుతుంది.

**ఇలా సెట్ చేసుకోండి..**

గూగుల్ మ్యాప్స్ యాప్ ఓపెన్ చేసి ప్రొఫైల్ మీద క్లిక్ చేయాలి.
'సెట్టింగ్స్'లోకి వెళ్లి 'నేవిగేషన్ సెట్టింగ్స్' ఎంచుకోవాలి.
కిందకు స్క్రోల్ చేస్తే అక్కడ కనిపించే 'రూట్ ఆప్షన్' అనే ట్యాబ్‌లో 'ప్రిఫర్ ఫ్యూయల్ ఎఫిసెంట్ రూట్స్' అనే ఆప్షన్ ఎనేబుల్ చేసుకోవాలి.
వాహనం ఇంజిన్, ఫ్యూయల్ టైప్‌ను ఎంచుకోవాలి.
నేవిగేషన్ ట్యాబ్ లోనే టోల్ ధర, స్పీడో మీటర్ వంటి ఆప్షన్లు ఎంచుకోవచ్చు.
వాహన వేగంతోపాటు మీరు వెళ్లే రూట్‌లో ఎంత టోల్ ఫీజు పే చేయాలో ఈ ఫీచర్ చెబుతుంది.




## దక్షిణ కొరియాకు కొత్త భయం



సరిహద్దుల్లో ఉత్తర కొరియా కవ్వింపు చర్యలతో సతమతమయ్యే దక్షిణ కొరియాకు కొత్త భయం పొంచి ఉంది!. అయితే అది బయటి నుంచి కాదు. దేశ అంతర్గత సమస్య కావటం గమనార్హం. దక్షిణ కొరియాలో జననాల రేటు క్షీణిస్తోంది. సంతానోత్పత్తి తగ్గుదల భవిష్యత్తులో దేశ జనాభా క్షీణించడంలో తీవ్ర ప్రభావం చూపించనున్నట్లు తెలుస్తోంది. తాజా గణాంకాల ప్రకారం సగటు జననాల రేటు 0.72గా నమోదైంది. ఈ తగ్గుదల ఇలాగే 2025 వరకు కొనసాగితే 0.65గా నమోదవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అంతకంతకు తగ్గుతున్న సంతానోత్పత్తి ఇలాగే కొనసాగితే దక్షిణ కొరియా జనాభా విషయంలో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోనుంది. ఇక 2022 ఏడాదిలో ప్రపంచంలో అతి అక్కువ సంతానోత్పత్తి 0.78 శాతంగా నమోదు చేసుకున్న దేశం దక్షిణ కొరియా కావడం గమనార్హం. దక్షిణ కొరియాలో జననాల రేటు తగ్గుదల.. ఆ దేశ అర్థిక వ్యవస్థ, శ్రాకమిక శక్తి, ఉత్పత్తిపై తీవ్రమైన ప్రభావం చూపనుందని అధికారులు పేర్కొన్నారు. అదీకాక ఉత్తర కొరియా నుంచి ముప్పు పొంచి ఉన్న దక్షిణ కొరియా.. సైనిక, రక్షణ రంగంలో కూడా ఇబ్బందులు ఎదురుకానున్నాయి. జనాభా పరంగా చూసుకుంటే 2024లో 36.2 మిలియన్ల నమోదు కానుందని గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న జనాభా 51.7తో పోల్చుకుంటే దాదాపు 30 శాతం తగ్గుదల నమోదు కానున్నట్లు అంచనా. డిసెంబర్ నెల ప్రారంభంలో దక్షిణ కొరియా ఆర్థిక మంత్రి నామినీ చోయ్ సాంగ్ మాక్ దేశంలో జననాల రేటు క్షీణించడాన్ని ఓ ప్రమాదంగా పేర్కొన్నారు. చర్యలు చేపట్టడంలో చాలా ఆలస్యం జరిగిపోయిందని అన్నారు.

## పార్లమెంట్ భద్రత.. ప్రభుత్వ బాధ్యత కాదు'



**ఢిల్లీ:** పార్లమెంట్ భద్రత వైఫల్యంపై విపక్షాలు పార్లమెంట్‌లో నిరసనలు, ఆందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఈ విషయంలో ప్రధానమంత్రి లేదా కేంద్ర హోం మంత్రి జవాబు చెప్పాలని పెద్ద ఎత్తున పట్టుబడుతున్నారు. ఈ క్రమంలోనే గురువారం 13 మంది లోక్ సభ సభ్యులు, రాజ్యసభలో ఒక ఎంపీ సస్పెన్షన్‌కు గురైనారు. అయితే తాజాగా విపక్షాల ఆందోళనలపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ భద్రతా వైఫల్యాలు 1974, 1994లో కూడా చోటు చేసుకున్నట్లు వెల్లడించారు. ఇప్పుడు జరిగింది తొలిసారి కాదని అన్నారు. పార్లమెంట్ భద్రత కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన బాధ్యత కాదని అన్నారు. పార్లమెంట్ భద్రత వైఫల్యంపై ప్రధాని, కేంద్ర హోం మంత్రి మాట్లాడమని విపక్షాలు ఆందోళన చేయడం సరికాదని మండిపడ్డారు. పార్లమెంట్ భద్రతా వ్యవహారం మొత్తం లోక్‌సభ సెక్యూరిటీకి సంబంధించిందని అన్నారు. 1974లో అయితే ఏకంగా ఓ వ్యక్తి రెండు తుపాకులు చేతిలో పట్టుకొని పార్లమెంట్‌లోకి వచ్చాడని తెలిపారు. కానీ, ఆనాటీ ప్రతిపక్షమైన జనసంఘ్ దాన్ని ఓ పెద్ద వివాదంగా చేయలేదని అన్నారు. ప్రధాన మంత్రి, హోం మంత్రి బాధ్యత వహించాలని నిరసనలు తెలపలేదని అన్నారు. ఎందుకుంటే పార్లమెంట్ భద్రత.. బాధ్యత లోక్‌సభ సెక్రటేరియట్‌కు చెందినదని ఆయన 'ఎక్స్' ట్విటర్‌లో పేర్కొన్నారు.

## పార్లమెంట్‌లో భద్రతాలోపంపై వరుసగా రెండో రోజూ విపక్షాల ఆందోళన

**ఉభయసభలు సోమవారానికి వాయిదా**

**న్యూఢిల్లీ :** పార్లమెంట్‌లో భద్రతాలోపంపై వరుసగా రెండో రోజూ ఉభయసభలు వాయిదాపడ్డాయి. ఉదయం పార్లమెంట్ ప్రారంభం కాగానే ఇటు లోక్‌సభ, అటు రాజ్యసభ రెండింటిలో విపక్ష ఎంపీల ఆందోళన మొదలైంది. పార్లమెంట్‌లో కలర్ స్మోక్ ఘటనపై చర్చ చేపట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అయితే ఆ అంశం కోర్టులో ఉన్నదని, దానిపై చర్చకు పట్టుబట్టడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు.స్పీకర్ ఓం బిర్లా ఇచ్చిన ఆదేశాలనే తమ ప్రభుత్వం పాటిస్తున్నదని మంత్రి తెలియజేశారు. అయినా విపక్షల ఎంపీలు వినిపించుకోకపోవడంతో పార్లమెంట్ ఉభయసభలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. మధ్యాహ్నం రెండు గంటలకు సభలు ప్రారంభమైన తర్వాత కూడా ఉభయసభల్లో సేమ్ సీన్ రిపీట్ అయ్యింది. దాంతో ఉభయసభలు సోమవారానికి వాయిదాపడ్డాయి. సోమవారం ఉదయం 11 గంటలకు ఉభయసభలు ప్రారంభం కానున్నాయి.

## ప్లాన్ A&B.. పార్లమెంట్‌పై దాడిలో సంచలన విషయాలు



**ఢిల్లీ:** పార్లమెంట్ భద్రతా వైఫల్యం కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధాన సూత్రధారిగా పేరుగాంచిన లలిత్ ఝా కీలక విషయాలను పోలీసులకు తెలిపారు. ఈ వ్యవహారంలో వారు రెండు వ్యూహాలను పన్నినట్లు చెప్పాడు. ఒకవేళ ప్లాన్ ఏ విఫలమైతే ప్లాన్ బీని ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పాడు. ప్లాన్ ఏ ప్రకారం నీలం, అమోల్ పార్లమెంట్‌లోకి ప్రవేశించకపోతే మరోవైపు నుంచి మహేశ్, కైలాష్ ప్రవేశించాలని నిర్ణయించుకున్నట్లు లలిత్ చెప్పాడు. పొగ బాంబులను మండించి నినాదాలు చేయాలని సంకల్పించినట్లు పేర్కొన్నాడు. మహేష్, కైలాష్ గురుగ్రామ్‌లోని తాము నివాసం ఉన్న విశాల్ శర్మ(విక్కి) ఇంటికి చేరుకోవడంలో విఫలమైనందున అమోల్, నీలం ఎలాగైనా పని పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించాడు.
పార్లమెంట్‌లో ఆరుగురు వ్యక్తులు బుధవారం గందరగోళం సృష్టించారు. పక్కా ప్రణాళికతో పార్లమెంట్‌లోకి అడుగుపెట్టిన నిందితులు గ్యాస్ క్యానిస్టర్లను ప్రయోగించారు. ఇద్దరు నిందితులు లోక్‌సభ లోపలికి ప్రవేశించి పసుపు రంగు గ్యాస్‌ను ప్రయోగించారు. దీంతో ఎంపీలంతా భయాందోళనకు గురయ్యారు. నిందితులను ఎంపీలే పట్టుకుని భద్రతా సిబ్బందికి అప్పగించారు. మరో ఇద్దరు పార్లమెంట్ ఆవరణలో అలజడి సృష్టించారు. ఈ కేసులో నలుగురు నిందితులను ఉపా(దేశ వ్యతిరేక కార్యకాలాపాల చట్టం) చట్టం కింద పోలీసులు అరెస్టు చేశారు. 2001 డిసెంబర్ 13న పార్లమెంట్‌పై దాడి జరిగిన రోజే మళ్లీ ఈ ఘటన జరగడం తీవ్ర చర్చకు దారి తీసింది. మనోరంజన్, సాగర్ శర్మ, నీలమ్, అమోల్ శిందె, విశాల్, లలిత్, మహేశ్ అనే ఏడుగురు దుండగులు ఈ ఘటనకు పాల్పడిన విషయం తెలిసిందే. ఇందులో మనోరంజన్, సాగర్‌శర్మ లోక్‌సభలోకి చొరబడగా.. నీలమ్, అమోల్ శిందే పార్లమెంట్ భవనం వెలుపల గందరగోళం సృష్టించారు. ఈ నలుగురితో పాటు వీరికి బస ఏర్పాటు చేసిన విశాల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహేష్‌ను ఇప్పటికే అరెస్టు చేశారు. ఈ ఐదుగురి మొబైల్ ఫోన్స్‌తో పరారైన లలిత్ ఝా ప్రస్తుతం లొంగిపోయాడు.

రిపబ్లిక్ హిందుస్థాన్

శనివారం 16 డిసెంబర్ 2023

# మా గోడు వినండి..

-మొదటి పేజీ తరువాయి

లేవు. అయినా నిబంధనలకు విరుద్ధంగా, చట్టంలోని అసలు ఉద్దేశ్యానికి భిన్నంగా బదిలీలకు గత ప్రభుత్వం దిగిందన్నది కార్యదర్శుల ఆవేదన.

**పంచాయతీరాజ్ శాఖ ఏం చేసింది?**

అప్పటి పంచాయతీరాజ్ కమిషనర్ రెండేళ్ల కింద ఒక ప్రొసిడింగ్ తీసుకొచ్చారు. సెప్టెంబర్ 15, 2023న వచ్చిన ప్రొసిడింగ్ 2560/%జ==ు=జు/దీ%2/2017 ప్రకారం గ్రేడ్‌లు లేవని చెప్పారు. కానీ 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జారీ చేసిన %+ూ% 81,84 ప్రకారం క్యాడర్ స్ట్రెంత్‌ను పరిగణనలోకి తీసుకుని కేటాయింపులు జరిపారు. గత ప్రభుత్వం పాత నిబంధనలను పట్టించుకోకుండా కేటాయింపు జరపడం వల్ల కార్యదర్శులు స్థానికతను శాశ్వతంగా కోల్పోవలసి వచ్చింది. దీనివల్ల పంచాయతీరాజ్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని కార్యదర్శులు తెలిపారు.




**ముఖ్యమంత్రికి ఇచ్చిన వినతిలో ఏముందంటే?**

గద్వాల జోగులాంబ జోన్ , చార్మినార్ జోన్ గ్రేడ్-1 కార్యదర్శులను మల్టీ జోన్ రెండు నుంచి మల్టీ జోన్-1 లోని బాసర జోన్, రాజన్న సిరిసిల్ల జోన్లకు కేటాయించారు. దీనివల్ల సుమారు 125 మంది పంచాయతీ కార్యదర్శులు ఏకంగా 300 కిలోమీటర్ల నుంచి 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాలకు బదిలీ అయ్యారు. రాజన్న సిరిసిల్ల జోన్, కాళేశ్వరం జోన్, బాసర జోన్ లోని గ్రేడ్-1, గ్రేడ్- 2 కార్యదర్శులను భద్రాద్రి జోన్‌కు బదిలీ చేశారు. కాళేశ్వరం జోన్ లోని గ్రేడ్-2, అలాడే గ్రేడ్-3 కార్యదర్శులు సిరిసిల్ల జోన్ కి బదిలీ అయ్యారు. దీనివల్ల 125 మంది కుటుంబాలు రెండు మూడు వందల కిలోమీటర్ల దూరంగా విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. బదిలీ అయిన కొత్త ప్రాంతం సుదూరంలో ఉండడం వల్ల తల్లిదండ్రులకు, భార్యాపిల్లలకు దూరంగా ఉండాల్సి వస్తుందని కార్యదర్శులు వాపోతున్నారు. గత రెండేళ్లుగా మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా అన్ని ఇబ్బందులకు గురయ్యామని ముఖ్యమంత్రికి తెలిపారు. పంచాయితీ కార్యదర్శి పోస్టు అనేది గ్రామస్థాయి పోస్టు కాబట్టి తమ పట్ల మానవతా దృక్పథంతో సొంత జోనులకు లేదా సొంత జిల్లాలకు బదిలీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.

# ప్రజా సంక్షేమం కోసమే ఆరు గ్యారెంటీలు

-మొదటి పేజీ తరువాయి

ప్రజల్లో కలుగుతోంది' అని గవర్నర్ అన్నారు.

'యూపీఏ ప్రభుత్వమే తెలంగాణను ఏర్పాటు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం రోజే తన లక్ష్యాలను స్పష్టంగా చెప్పారు. ఇది నిజమైన ప్రజా పాలన. నిరుద్యోగుల కలను మా ప్రభుత్వం నెరవేరుస్తుంది. అమరుల ఆశయాలు, ప్రజల ఆకాంక్షల మేరకే పాలన సాగిస్తాం. తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన సోనియా గాంధీకి కృతజ్ఞతలు'అని గవర్నర్ అన్నారు.

పదేళ్ల నిర్బంధ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగిందని గవర్నర్ తమిళిసై అన్నారు. శుక్రవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ప్రజాకవి కాళోజీ కవితతో గవర్నర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. మార్పు ఫలాలు ప్రజలకు చేరుతున్నాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తొందర్లోనే అమలు చేస్తామని ప్రభుత్వం పేర్కొందన్నారు. గత ప్రభుత్వ నిర్వాహకంతో విద్యుత్ సంస్థలు రూ.81,516 కోట్లు అప్పుల్లో ఉందన్నారు. 50 వేల 275 కోట్ల నష్టంలో విద్యుత్ సంస్థ కొనసాగుతుందని... పౌర సరఫరాల శాఖ 56 వేల కోట్లు అప్పుల్లో ఉందన్నారు. దాడి తప్పిన ఆర్థిక వ్యవస్థపై తమ ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. త్వరలో శాఖల వారీగా శ్వేత పత్రం విడుదల చేయనున్నట్లు చెప్పారు. గడిచిన తొమ్మిదిన్నర ఏళ్ళల్లో చాలా సంస్థలు విధ్వంసానికి గురయ్యాయన్నారు.

రాష్ట్రంలో ఏర్పడ్డ కొత్త ప్రభుత్వానికి గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అభినందనలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరాలని కోరుతున్నా. ప్రజాసేవలో విజయం సాధించాలని కొత్త ప్రభుత్వాన్ని కోరుతున్నానని గవర్నర్ పేర్కొన్నారు.

ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే దిశగా కృషి చేస్తాం. ప్రజా



ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రజావాణి చేపట్టాం. కొత్త ప్రభుత్వం ప్రయాణం ప్రజాసేవకు అంకితం కావాలని కోరుకుంటున్నాను. రైతులు, యువత, మహిళలకు ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది. ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. ప్రజా సంక్షేమం కోసమే ఆరు గ్యారెంటీలు ప్రకటించాం. హామీలకు చట్టబద్ధత కల్పించే దస్త్రంపై తొలి సంతకం చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతిమాటకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ స్పష్టం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే రెండు గ్యారెంటీలు అమలు చేశాం. వచ్చే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రజల ఆరోగ్య భద్రత.. మా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీని ప్రస్తుత అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దాం. రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిధిని రూ. 10 లక్షలకు పెంచాం. ఎన్నికల వేళ కాంగ్రెస్ ప్రకటించిన అన్ని డిక్లరేషన్లు అమలు చేస్తాం. అమరవీరుల కుటుంబాలకు 250 గజాల ఇంటి స్థలం, గౌరవభృతి ఇస్తాం. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇచ్చేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రతి పంటకు మద్దతు ధర ఇస్తాం. రూ. 2 లక్షల రుణమాఫీపై త్వరలోనే కార్యాచరణ ఉంటుంది. అసైన్డ్, పోడు భూములకు త్వరలోనే పట్టాల పంపిణీ చేపడుతాం అని గవర్నర్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా యువతకు మేం ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చుతాం అని గవర్నర్ స్పష్టం చేశారు. ఏడాది లోపు మా ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తుందని, ఆరు నెలల్లో మెగా డీఎస్సీ నిర్వహించి, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. రైతులు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళ, యువత, అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులు ఇలా ప్రతీ వర్గాన్ని పరిగణనలోకి తీసుకుని సంక్షేమం, అభివృద్ధి కార్యాచరణ ఉంటుంది. యువత జాబ్ క్యాలెండర్ విషయంలో చెప్పిన మాట ప్రకారం కార్యాచరణ ఉంటుందని గవర్నర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ వ్యవస్థలు వ్యక్తుల కోసం పనిచేసాయని తెలిపారు. కార్య నిర్వాహక వ్యవస్థలో విలువలను పునరుద్ధరిస్తామని చెప్పారు. ఏ పార్టీ ఎమ్మెల్యే అయినా తమ ప్రభుత్వం సమాన దృష్టితో చూస్తుందన్నారు. అనిచివేతకు, వివక్షకు గురైన ప్రతి వర్గానికి తమ ప్రభుత్వంలో స్థానం ఉంటుందన్నారు. గ్రామీణ అభివృద్ధిలో గత ప్రభుత్వం ప్రచారానికే పరిమితం అయ్యిందన్నారు. ప్రతి గ్రామ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమ కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ధరణి పోర్టల్ స్థానంలో భూమాత పేరుతో పోర్టల్ తెస్తామని హామీ ఇచ్చామని.. కార్యాచరణ రూపొందిస్తామన్నారు. గవర్నర్ ప్రసంగం ముగిసిన అనంతరం అసెంబ్లీ రేపటి (శనివారం) వాయిదా పడింది.

# కమలం పార్టీలో తుఫాను

**హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి భారతీయ జనతా పార్టీలో సందడి లేదు. పెద్దగా పార్టీ నేతలు ఎవరూ స్పందించడం లేదు. ఫలితాల విషయంలో నిరాశగా ఉన్నారని అందుకే మాట్లాడటం లేదని అనుకోవచ్చు. నిజానికి బీజేపీకి అంత నిరాశజకనమైన ఫలితాలు రాలేదు. తెలంగాణలో ఎనిమిది సీట్లు వచ్చాయి. ఇవి మజ్లిస్ పార్టీ కంటే ఎక్కువ. గత ఎన్నికల్లో ఒక్కటే వచ్చింది. ఈ సారి ఏకంగా 19 స్థానాల్లో రెండో స్థానంలో నిలిచింది. ఇవి మరీ తీసి పడేయాల్సిన ఎన్నికలు కావు. కానీ పార్టీ నేతల మధ్య మధ్య మాత్రం ఓ రకమైన ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. బండి సంజయ , ఈటల రాజేందర్ , కిషన్ రెడ్డిల మధ్య ఏదో జరుగుతోందని బీజేపీ వర్గాలంటున్నాయి. ఈ అంతర్గత పోరాటం అంశం సోషల్ మీడియాకు ఎక్కుతోంది. శాసనసభ ఎన్నికల్లో ఆశించిన స్థాయి సీట్లను గెలుచుకోలేక పోయిన తెలంగాణ బీజేపీకి అంతర్గత సమస్యలు ఇబ్బందికరంగా మారాయి. 2020లో తెలంగాణ బీజేపీ సారథిగా నియమితులైన బండి సంజయ్.. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం అనే స్థాయికి తీసుకువచ్చారు. కానీ, ఎన్నికలకు సరిగ్గా నాలుగు నెలల క్రితం ఆయన స్థానంలో కిషన్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించింది బీజేపీ అధిష్టానం. అయితే బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించడానికి మాజీ మంత్రి ఈటల రాజేందరే కారణమని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అయ్యాయి. బండి సంజయ్ సారథిగా కొనసాగిఉంటే కాంగ్రెస్ స్థానంలో బీజేపీ ఉండేదన్న సరికొత్త వాదనలు ఆయన అనుచర వర్గం తెరపైకి తీసుకొచ్చింది. మరోవైపు బండి సంజయ్ అనుచరులకు కౌంటర్ ఇస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు ఈటల రాజేందర్ అనుచరులు. తన అనుచరులంటూ టికెట్లు ఇప్పించుకున్న వారికి బండి సంజయ్ గెలిపించుకోలేకపోయారని విమర్శిస్తున్నారు. చివరకు తన పార్లమెంట్ పరిధిలోకూడా ఎమ్మెల్యేలను గెలిపించుకోలేకపోయారని సోషల్ మీడియాలో ఈటల అనుచరులు ఫుల్ ఫైర్ అయ్యారు. ఇవి శృతి మించి పోతూండటంతో.. ఈటల రాజేందర్ స్పందించారు. సోషల్ మీడియాలో తన పేరుతో..తన అనుచరుల పేరుతో పెడుతున్న పోస్టులన్నీ ఫేక్ అని ప్రకటించారు. ఈ సోషల్ మీడియా వార్ బండి, ఈటలకు మాత్రమే పరిమితం కాలేదు. తెలంగాణ బీజేపీ ప్రెసిడెంట్ కిషన్ రెడ్డిని సైతం



వదలడం లేదు. పార్టీ ఓటమికి కారణం ఆయనేనని విమర్శిస్తూ పోస్టులు పెడుతున్నారు. దీనిని కంట్రోల్ చేయాల్సిన నేతలు మాత్రం మౌనం వహిస్తున్నారు. బండి సంజయ్‌కు మళ్లీ తెలంగాణ అధ్యక్ష బాధ్యతలు ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో దానిపై పార్టీ కార్యకర్తలు వెటకారంగా పోస్టులు పెడుతున్నారు. మరోసారి బండిని పార్టీ అధిష్టానం మోసం చేస్తుందని.. అందుకే ఇప్పుడు అధ్యక్ష బాధ్యతలు తీసుకోకూడదని.. కావాలంటే చివరి రెండేళ్లు ఆ బాధ్యతను తీసుకోవాలని సెటైర్లు వేస్తున్నారు. కిషన్ రెడ్డి విషయంలో జరుగుతున్న ప్రచారం మరింత భిన్నంగా ఉంది. ఆయన పై వ్యతిరేకత వచ్చేలా.. జనసేన గురించి ఏదో అన్నారంటూ పోస్టులు పెట్టారు. దీంతో కిషన్ రెడ్డి తాను అలా అనలేదని .. ..తప్పుడు ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించాల్సి వచ్చింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి సీనియర్ నేతలంతా సైలెంట్ అయ్యారు. దీనికి కారణం తాము టిక్కెట్లు ఇప్పించుకున్న వారు ఓడిపోవడమే. కిషన్ రెడ్డి అంబర్ పేట నియోజకవర్గంలో బీజేపీని గెలిపింలేకపోయారు. గద్వాలలో పోటీ చేయకుండా వేరొకరికి టిక్కెట్ ఇప్పించిన డీకే అరుణ అభ్యర్థిని గెలుపు అంచుల వరకూ తీసుకు రాలేకపోయారు. తన కుమారుడికి మహబూబ్ నగర్ టిక్కెట్ ఇప్పించుకున్న జితేందర్ రెడ్డి పరిస్థితి కూడా అదే. ఇక బండి సంజయ్ స్వయంగా ఓడిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరూ మాట్లాకపోగా.. పార్టీలో అంతర్గత రచ్చ పెట్టుకునేందుకు సోషల్ మీడియా సైన్యాలు రంగంలోకి దిగడంతో బీజేపీ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్?యలో పడినట్లవుతోంది. పార్లమెంట్ ఎన్నికలు ఎంతో దూరంలో లేవు. మరో మూడు నెలల్లోనే ఉన్నాయి. ఈ సమయంలో బీజేపీ అగ్రనేతలు అసెంబ్లీ గురించి మర్చిపోయి పార్లమెంట్ ఎన్నికల గురించి ఆలోచించాల్సి ఉంది. గతంలో గెలిచిన సికింద్రాబాద్ స్థానంలో ఈ సారి బీజేపీ మూడో స్థానంలోకి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల నాటికి పరిస్థితిని మెరుగు పర్చుకోవాల్సింది పోయి.. ఇలా వర్గ పోరాటానికి దిగితే.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీజేపీకి పరాభవం తప్పదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో... కొంత మంది సీనియర్లు ఆ పార్టీ వైపు చూసే అవకాశం ఉందన్న ప్రచారమూ జరుగుతోంది.

## యశోద ఆస్పత్రి నుంచి కేసీఆర్ డిశ్చార్జ్



**హైదరాబాద్ :** తుంటి ఎముక సర్జరీ చేయించుకుని కోలుకుంటున్న మాజీ సీఎం కేసీఆర్ యశోద ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. డిశ్చార్జ్ అయి బంజారాహిల్స్‌లోని నందినగర్‌లోని ఆయన పూర్వ నివాసానికి వెళ్లారు. కేసీఆర్ కొద్దిరోజుల పాటు నందినగర్‌లోని ఇంట్లోనే ఉండనున్నారు. సర్జరీకి సంబంధించి డాక్టర్లకు అందుబాటులో ఉండాలన్న కారణంతోనే కేసీఆర్ గజ్వేల్‌లోని తన ఫామ్‌హౌజ్‌కు వెళ్లకుండా నందినగర్‌లోని ఇంటికి వెళ్లినట్లు తెలుస్తోంది. తొమ్మిదిన్నర ఏళ్ళ తర్వాత నందినగర్‌లోని సొంత ఇంటిలో కేసీఆర్ బస చేయనున్నారు. నందినగర్ ఇంటిని 2000 సంవత్సరంలో నిర్మించారు. 2021 జులై 13న ఇంటి మరమ్మతు పనులను కేసీఆర్ పరిశీలించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ ఇంటి నుంచే కేసీఆర్ కార్యాచరణ రూపొందించారు. తొమ్మిదిన్నరేళ్ల తర్వాత సొంత ఇంటికి కేసీఆర్ వస్తుండడంతో పూలదండలతో అలంకరించిన కుటుంబ సభ్యులు ఉదయమే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 7వ తేదీ అర్ధరాత్రి కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన ఫాంహౌజ్ బాత్‌రూమ్‌లో జారిపడడంతో తుంటి ఎముక విరిగిన విషయం తెలిసిందే. వెంటనే ఆయనను సోమాజిగూడలోని యశోద ఆస్పత్రికి తరలించగా వైద్యులు ఆయనకు తుంటి ఎముకు రిప్లేస్‌మెంట్ సర్జరీ చేశారు. సర్జరీ తర్వాత వారంరోజుల పాటు ఆస్పత్రిలోనే ఉన్న ఆయనను శుక్రవారం వైద్యులు డిశ్చార్జ్ చేశారు. ఆపరేషన్ కారణంగా కేసీఆర్ అసెంబ్లీలో ఇంకా ఎమ్మెల్యేగా కూడా ప్రమాణ స్వీకారం చేయలేదు.

## నా కోసం ట్రాఫిక్ ఆపొద్దు



-మొదటి పేజీ తరువాయి

లేకుండానే తన కాన్వాయ్‌ను తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని ఈ సందర్భంగా అధికారులు ఆయనతో చెప్పినట్లు తెలుస్తోంది. సీఎంతో పాటు మంత్రులు, ఇతర రాజకీయ ప్రముఖుల పర్యటన సమయంలో ట్రాఫిక్ నిలిపివేత గురించి తెలిసిందే. ప్రత్యేకించి హైదరాబాద్‌లో అది మరీ నరకంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న తాజా నిర్ణయంపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యే అవకాశం కనిపిస్తోంది.

**కొత్త కాన్వాయ్ వద్దు!**

కాన్వాయ్ విషయంలోనూ ఆయన మరో నిర్ణయం తీసుకున్నారు. కొత్త కార్లు కొనుగోలు చేయకుండా.. తన కాన్వాయ్‌లోనే ఉన్న అన్ని తెల్ల రంగు కార్లకు నల్ల రంగు వేయాలని అధికారుల్ని ఆదేశించారు. ప్రభుత్వం లోటు బడ్జెట్‌లో ఉన్న నేపథ్యంలోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి.

## పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి

-మొదటి పేజీ తరువాయి



బీఆర్ఎస్ పై సమానంగా పోరాటం చేస్తాం. లోక్‌సభలో అత్యధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. తెలంగాణలో రాజకీయంగా బీజేపీకి మంచి అవకాశముంది. సర్వే సంస్థలకు సైతం అందని విధంగా లోక్‌సభ ఫలితాలుంటాయి' అని కిషన్ రెడ్డి తెలిపారు. 'రేపటి నుంచి తెలంగాణలో వికసిత్ భారత్ కార్యక్రమం ప్రారంభమవుతుంది. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి. కొత్తగా ఎన్నికైన 8మంది బీజేపీ ఎమ్మెల్యేలు అన్ని ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తారు. మూడోసారి నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడబోతోంది. పార్టీకి సంబంధించి అన్ని కమిటీల నియామకాలు పూర్తిచేయాలి' అని నేతలకు కిషన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## టీటీడీపి ఓటు ఎవరికి బదిలీ..

**హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకూడదనే తెలుగుదేశం పార్టీ నిర్ణయం టీటీడీపీ నాయకుల్ని నొప్పించినా అది ఏ మేరకు కాంగ్రెస్ పార్టీకి ఉపయోగ పడిందనేది కాంగ్రెస్ నాయకుల మెదళ్లను తొలుస్తోంది. తెలంగాణలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీకి దాదాపు మూడు శాతం ఓట్లు వచ్చాయి. తాజాగా ఎన్నికల్లో పోటీ చేయలేదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ప్రధానంగా ఆంధ్రా సెటిలర్ ఓట్లు అధికంగా ఉంటాయి. దాదాపు 40లక్షల మంది ఆంధ్రా స్థానికత ఉన్న వారు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్నారనే అంచనాలు ఉన్నాయి. తాజా ఎన్నికల్లో టీడీపీ సానుభూతిపరుల ఓట్లు పూర్తి స్థాయిలో కాంగ్రెస్‌కు బదిలీ కాలేదని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్‌లో దెబ్బతినడానికి ఇదే కారణమని అనుమానిస్తున్నారు. తెలంగాణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయకపోవడం వల్ల కొంత లాభ పడినా, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో టీడీపీ, సెటిలర్ల ఓట్లు ఏ మాత్రం కాంగ్రెస్ పార్టీకి బదిలీ కాలేదని కాంగ్రెస్ భావిస్తోంది. తెలంగాణ జిల్లాల్లో ప్రధానంగా నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో టీడీపీ ఓట్లు కొంత మేరకు కాంగ్రెస్‌కు బదిలీ అయినట్టు చెబుతున్నారు. తెలంగాణలో కనీసం 90కు పైగా సీట్లు వస్తాయని భావించినా ఆ మేరకు విజయం సాధించలేక పోవడానికి జనసేనతో పోటీ చేయడంతో పాటు టీడీపీ ఓట్లు బదిలీ కాకపోవడం కూడా కారణమని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. టీడీపీ మాదిరి జనసేన కూడా పోటీలో లేకుండా ఉంటే ఖచ్చితంగా కాంగ్రెస్ మరికొన్ని సీట్లలో గెలిచి ఉండేదని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 64స్థానాలకే పరిమితం కావడానికి టీడీపీ నుంచి పూర్తి స్థాయిలో ఓట్లు బదిలీ కాకపోవడం కూడా కారణమేనని చెబుతున్నారు. బిఆర్ఎస్‌కు వచ్చిన 39 ఎమ్మెల్యేల్లో ఎక్కువగా హైదరాబాద్ పరిధిలోనే వచ్చాయి. బిఆర్ఎస్ మీద నిజంగా వ్యతిరేకత కంటే స్థానికంగా తమ ప్రయోజనాలను బిఆర్ఎస్‌తో ఉపయోగమనే భావనతోనే ఓట్ల బదిలీ జరగలేదని కాంగ్రెస్ పార్టీ నేతలు భావిస్తున్నారు. బీజేపీకి 8సీట్లు దక్కాయి.

Printed , Publisher , Edited and Owned by Rathod Raju , Printed at Jai Bhavani Printing Press , H.No. 2-42, Village : Jamidi Mdl. Ichoda Dist. Adilabad., State Telangana , Pin code – 504 307 ( T.S.) , TITLE CODE : TELTEL02020EDITOR : RATHOD RAJU , Contact Numbers : 9908940762 , 8985614333 . Email : republichindustan.rh@gmail.com , www.republichindustan.in ,